



# విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206




చమురు ధరలు తగ్గడంతో దూసుకెళ్లిన మార్కెట్లు.. సెన్సెక్స్ 315 పాయింట్లు జంప్

సంపుటి:-01, సంచిక:-121, శనివారం 26-09-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

## పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత

యశోదా ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్!



- యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శన్ రెడ్డి
- అరగంట పాటు ఆసుపత్రిలో గడిపిన వైద్యులు
- మెదడు పనితీరు సాధారణ స్థితికి రావాల్సి ఉందన్న వైద్యులు

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై - మిగతా 2 లో

## సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు



- సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అన్న కిషన్ రెడ్డి
- నాలుగు రాష్ట్రాలతో పాటు ఎన్టీపీసీకి బొగ్గు సరఫరా చేస్తోందని వెల్లడి
- కేసీఆర్ పాలనలో సింగరేణిని రాజకీయ వేదికగా మార్చేశారని మండిపాటు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థను తీవ్రంగా మోసం చేశారని కేంద్ర - మిగతా 2 లో

# హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్..!

- హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ
- హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.
- ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని

# సీఎం విజయ్ సర్కార్‌కు ఎదురుదెబ్బ

- కరూర్ బాధితుల నియామకాలు రద్దు
- తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే జీవోను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు
- ఈ నియామకాలు రాజ్యాంగంలోని సమానత్వ, సమాన అవకాశాల హక్కులకు విరుద్ధమని వ్యాఖ్య
- ప్రభుత్వ ఉద్యోగాలను విషాదాలకు పరిహారంగా ఇవ్వలేమన్న కోర్టు




కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని

## కేసులు ఎత్తివేయకుంటే: కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక




- ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని సీజేపీ ఆరోపణ
- ఢిల్లీ వెలుపల నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- అదుపులోకి తీసుకున్న వారిని వెంటనే విడుదల చేయాలన్న కాక్రోచ్ జనతా పార్టీ
- హామీలు అమలు చేయకుంటే తదుపరి చర్యలు తప్పవని హెచ్చరిక

నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ - మిగతా 2 లో

## జంతర్ మంతర్ ఖాళీ విద్యార్థుల ఆందోళనకు తెర

కొత్త నిరసనకు రంగం సిద్ధం?



- జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ
- నెలరోజుల పాటు ఎన్నో సమస్యలకు, ఆవేదనలకు వేదికగా మారిన జంతర్ మంతర్
- ఇప్పుడు పెట్రోల్‌లో ఇథనాల్ కలపడంపై కొత్త ఆందోళనకు సన్నాహాలు
- తదుపరి నిరసనల కేంద్రంగా మారనున్న ఇథనాల్ అంశం?

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో, నీట్-యూజీ - మిగతా 2 లో

## ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి

తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక!

- దేశ భద్రతను కాపాడుకోవడానికి ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమన్న ఇరాన్
- ఉక్రెయిన్ వైఖరిని ఐరోపా దేశాలు అడ్డుకోవాలని డిమాండ్
- రాబోయే రోజుల్లో ఉక్రెయిన్ కు తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరిక



కాస్పియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బలగాలు జరిపిన దాడిలో ఒక నావికుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ భద్రతను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి - మిగతా 2 లో

## అమెరికా-ఇరాన్ మధ్య తగ్గిన ఉద్రిక్తతలు తెరవెనుక దౌత్య చర్చలు

- అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలికంగా ఆగిన దాడులు
- మధ్యవర్తుల ద్వారా ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు
- దౌత్యానికి అవకాశం ఇచ్చేందుకే దాడులు ఆపినట్టు తెలిపిన ట్రంప్
- అమెరికా దాడులు ఆపితేనే తాము సంయమనం పాటిస్తామన్న ఇరాన్



అమెరికా, ఇరాన్ మధ్య కొన్ని వారాలుగా కొనసాగుతున్న సైనిక ఘర్షణలకు తాత్కాలికంగా తెరపడింది. ఇరు దేశాలు గత మూడు రోజులుగా పరస్పర దాడులకు దూరంగా ఉన్నాయి. ఇదే సమయంలో మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌తో పరోక్షంగా చర్చలు జరుపుతున్నట్టు ఇరాన్ సోమవారం ప్రకటించింది. దీంతో దౌత్య మార్గాలు - మిగతా 2 లో

## తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం



- పౌరసరఫరాల శాఖ నిర్ణయాన్ని స్వాగతించిన పవన్ కల్యాణ్
- ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం
- సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ. 52
- పచ్చి బియ్యం కేజీ రూ. 50

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఊరట కలిగిస్తూ పౌర సరఫరాల శాఖ తీసుకున్న - మిగతా 2 లో

## డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం



- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలపైనా చర్చిద్దామని లోకేశ్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యమన్న లోకేశ్
- కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు

డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల - మిగతా 2 లో

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించండి

- ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం
- ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచన
- ప్రజల అంచనాలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టీకరణ
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం నిపుణుల సేవలు తీసుకోవాలని ఆదేశం
- పనితీరుపై క్షేత్రస్థాయి అభిప్రాయాలను అధికారులకు వివరించిన సీఎం




ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుందన్న అంచనాల నేపథ్యంలో, రైతులను అప్రమత్తం చేసి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల

# తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

మొదటిపేజీ తరువాయి – నిర్ణయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయించనున్నట్లు ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులను కాపాడేందుకు, ఏపీ ప్రజలకు అండగా నిలిచేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం అమలు కోసం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ బియ్యాన్ని అందుబాటులో ఉంచనున్నారు.

ధరల వివరాలు:

బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం: కేజీ రూ. 52

గ్రేడ్-1 పచ్చి బియ్యం (రా రైస్): కేజీ రూ. 50

బహిరంగ మార్కెట్ ధరలపై అత్యవసరంగా సమీక్షించి, రైస్ మిల్లర్లతో మాట్లాడి ప్రజలకు అందుబాటు ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం ఆఫీస్ ఎక్స్ వేదికగా స్పష్టం చేసింది. ప్రభుత్వ తీరు సామాన్యుల ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత

మొదటిపేజీ తరువాయి – యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ ఆసుపత్రికి వెళ్లారు. దాదాపు అర్ధగంట పాటు అక్కడే ఉండి వైద్యులను అడిగి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం సుదర్శన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని కేసీఆర్ కు వైద్యులు వివరించారు. ఆయన అవయవాలన్నీ సరిగ్గా పనిచేస్తున్నాయని, మెదడు పనితీరు సాధారణ స్థితికి రావలసి ఉందని, దీనిపై స్పష్టత రావడానికి మరో 48 గంటల సమయం పడుతుందని తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎంత ఖర్చయినా సరే మెరుగైన వైద్యం అందించి పూర్తి కోలుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్యుల కృషి, దైవానుగ్రహం, ప్రజల ప్రార్థనలతో ఆయన త్వరలోనే కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఏం చేస్తారో ఏమో తెలీదు.. మా పెద్ది సుదర్శన్ రెడ్డిని మాత్రం కాపాడండి" అని వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.

# సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు

మొదటిపేజీ తరువాయి – మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో పాటు ఎన్టీపీసీకి ఇది బొగ్గును సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం సింగరేణిని వాడుకుని, దానికి తీవ్ర ఆర్థిక నష్టాన్ని చేకూర్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ సంస్థలో 49 శాతం వాటా, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్న ఆయన... కేసీఆర్ పాలనలో సింగరేణిని ఒక రాజకీయ వేదికగా మార్చేసి, దాని ఆదాయానికి కోలుకోలేని గండి కొట్టారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సింగరేణి పరిస్థితిలో పెద్దగా మార్పు ఏమీ రాలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, సింగరేణి పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# సీఎం విజయ్ సర్కార్‌కు ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి – 14, 16 అధికరణాలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. "విషాదకర ఘటనలు సంభవించినప్పుడు పరిహారంగా ప్రభుత్వ ఉద్యోగాలను పంపిణీ చేయలేరు. ఇది ఇప్పటికే కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి, విధి నిర్వహణలో ఉండి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం చేయడమే అవుతుంది" అని కోర్టు అభిప్రాయపడింది. ఇటువంటి నియామకాలను అనుమతిస్తే భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల వంటి ఇతర ఘటనలు జరిగినప్పుడు కూడా బాధితులు ఇదే తరహా డిమాండ్లు చేసే ప్రమాదం ఉందని ధర్మాసనం హెచ్చరించింది. గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్?లో ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నిర్వహించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. వారిలో ఇప్పటికే 29 మంది విధుల్లో చేరారు. ఈ నియామకాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చింది. నేరుగా ఉద్యోగాలు కల్పించడానికి బదులుగా బాధితుల కుటుంబ సభ్యులకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శిక్షణ వంటివి అందించి, వారు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించింది.

# ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి

మొదటిపేజీ తరువాయి – తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక! ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడబోమని స్పష్టం చేసింది. ఈ చర్యకు పాల్పడిన ఉక్రెయిన్‌కు రాబోయే రోజుల్లో తగిన శాస్తి జరుగుతుందని, యుద్ధం మరింత ముదరకుండా చూడాలంటే కీవ్ వైఖరిని ఐరోపా దేశాలు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రష్యా-ఉక్రెయిన్ పోరుతో ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ పదేపదే చెబుతున్నప్పటికీ... రష్యా నుంచి ఇరాన్ శాటిలైట్ సమాచారాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలు, అమెరికా మిలిటరీ స్థావరాలపై రష్యా సేకరించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ తన దాడుల కోసం వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన ఆంక్షల వల్ల చైనా తదితర దేశాల నుంచి వస్తువుల రవాణాకు ఇరాన్‌కు ఈ కాస్పియన్ సముద్ర మార్గమే దిక్కుగా మారింది. అలాంటి కీలకమైన దారిలో నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ఇదిలా ఉంటే, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు చెర్నిహివ్, ఖార్కివ్ నగరాలపై రష్యా ఆదివారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 7 బాలిస్టిక్ మిస్సైళ్లు, 136 ఆత్మాహుతి డ్రోన్లతో రష్యా వైమానిక దాడికి తెగబడినట్లు ఉక్రెయిన్ ఆర్మీ వెల్లడించింది. ఈ దాడిలో ఆరుగురు అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

# అమెరికా-ఇరాన్ మధ్య తగ్గిన ఉద్రిక్తతలు తెరవెనుక దౌత్య చర్చలు



మొదటిపేజీ తరువాయి – ఇంకా తెరిచే ఉన్నాయని, ఉద్రిక్తతలు మరింత పెరగకపోవచ్చని ఆశలు చిగురిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైమానిక దాడులను నిలిపివేయడంతో ఈ ప్రతిష్టంభన వీడింది. దౌత్యానికి మరో అవకాశం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ఐరాస రాయబారి మైక్ వాల్ట్జ్ తెలిపారు. చర్చలకు కొంత సమయం ఇవ్వాలని ట్రంప్ భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, అమెరికా ఉద్దేశాలపై తమకు తీవ్ర అనుమానాలు ఉన్నాయని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా దాడులు ఆపితేనే తాము కూడా దాడులు ఆపుతామని, ఈ సందేశాన్ని ఇప్పటికే వాషింగ్టన్‌కు పంపామని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అమెరికా చర్యలను బట్టే తమ సంయమనం ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. గతంలో చర్చల సమయంలో అమెరికా తమను మోసం చేసిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ ఆరోపించారు. మరోవైపు, సైనిక చర్యల కొనసాగింపుపై అమెరికాలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. నిరంతర దాడుల వల్ల పేట్రియాట్ గగనతల రక్షణ క్షిపణుల నిల్వలు గణనీయంగా తగ్గాయని, నిర్దేశిత లక్ష్యాలను ఇప్పటికే ఛేదించడంతో ఇకపై దాడులు కొనసాగించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని సైనికాధికారులు ట్రంప్‌కు సూచించినట్లు అమెరికా మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం దాడులు ఆగినా, ఈ విరామం ఎంతకాలం కొనసాగుతుందోనన్న అనిశ్చితి ఇరు దేశాల్లో నెలకొంది.

# డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం

మొదటిపేజీ తరువాయి – నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించండి

మొదటిపేజీ తరువాయి – సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. "ఎల్‌నినో వల్ల ఎదురయ్యే పరిణామాలను రైతులకు స్పష్టంగా వివరించాలి. ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో సూచిస్తూ, వారిని ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించాలి. దీనికోసం ఒక క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా మారాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందడంలో కొంత అంతరం కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆయన అధికారుల వద్ద ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగులు పనిచేయాలని హితవు పలికారు. రంపచోడవరం విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్‌గా ఉన్న విద్యార్థిని చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు సైకో మెట్రిక్ టెస్టులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసులు ఎత్తివేయకుంటే: కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి – సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు, నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. "బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. అయితే, ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చోసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలా చూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతే తదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర మంత్రులతో జరిపిన చర్చల అనంతరం సీజేపీ తన 36 రోజుల సుదీర్ఘ ఆందోళనను శనివారం విరమించుకున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసనకారులపై నమోదైన కేసులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వ హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. మరోవైపు, బీహార్‌లోని సివాన్‌లో నిరసనకారులపై ఏకే-47 ఎక్కుపెట్టిన ఒక కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# జంతర్ మంతర్ ఖాళీ.. విద్యార్థుల ఆందోళనకు తెర

మొదటిపేజీ తరువాయి – వ్యవహారంలో నెల రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలకు తెరపడింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తన నిరసనలను విరమించుకోవడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రస్తుతం ప్రశాంతంగా ఉంది. కానీ ఈ ఆందోళనల సమయంలో, ఈ ప్రాంతం కేవలం విద్యార్థుల సమస్యలకే పరిమితం కాలేదు, దేశంలోని అనేక ఇతర ఆవేదనలకు, అసంతృప్తులకు ఓ పెద్ద వేదికగా మారింది. "చదువుకోవడానికి స్కూల్ వాళ్ళు చాలా టార్చర్ చేస్తున్నారు" అంటూ ఓ 8వ తరగతి విద్యార్థి చెప్పిన మాటల నుంచి, మహిళా రిజర్వేషన్ల కోసం నినదించిన గొంతుల వరకు.. జంతర్ మంతర్ ఒక వినూత్న నిరసనల వేదికగా మారింది. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా వచ్చినప్పటికీ, అనేక బృందాలు తమ తమ సమస్యలను వినిపించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాయి. ఉద్యోగ అవకాశాలు లేవని కొందరు, వాహనాలకు నష్టం కలిగించే ఇథనాల్ బ్లెండింగ్‌ను వ్యతిరేకిస్తూ మరికొందరు తమ గళం విప్పారు. ఈ ఆందోళనల్లో కేవలం సాధారణ ప్రజలే కాదు, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు కూడా పాలుపంచుకున్నారు. కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు కేరళలోని కొచ్చి నుంచి రాగా, సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు తమ నేత అఖిలేష్ యాదవ్ నియోజకవర్గం కనౌజ్ నుంచి తరలివచ్చారు. మరోవైపు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్ వంటి సంస్థలు పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశాయి. మధ్యప్రదేశ్ నుంచి ఒంటరిగా వచ్చిన దృష్టిలోపం ఉన్న పురుషోత్తం పూరి, తన ఆగిపోయిన పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఇక్కడికి చేరుకున్నారు. తన గోడును ప్రభుత్వం వింటుందనే ఆశతో ఆయన ఢిల్లీ వచ్చారు. ప్రస్తుతం జంతర్ మంతర్ ఖాళీ అయినా, మరో భారీ నిరసనకు రంగం సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. అదే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడాన్ని తప్పనిసరి చేయడం. సీజేపీ స్ఫూర్తితో 'జు20 జనతా పార్టీ' అనే కొత్త సంస్థ, వినియోగదారులకు 100 శాతం పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. జులై 31న 'గాడీ మార్చ్', ఆగస్టు 4న ట్యాక్సీ సంఘాల పార్లమెంట్ మార్చ్ వంటివి ఇందుకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ తర్వాత, ఇప్పుడు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురిలే తదుపరి లక్ష్యమనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జంతర్ మంతర్‌లో నినాదాలు లేవు, జనాలు లేరు. కానీ కొన్ని వారాల పాటు, ఈ ప్రాంతం కేవలం విద్యార్థుల ఉద్యమ కేంద్రంగానే కాకుండా, దేశవ్యాప్త అసంతృప్తులకు ఒక జాతీయ నోటీసు బోర్డులా మారింది. ఒక గొంతు ప్రభుత్వాన్ని కదిలించినప్పుడు, తమ గొంతు కూడా వింటారనే నమ్మకంతో ఎందరో ఇక్కడికి వచ్చారు. ఇప్పుడు ఇథనాల్ అంశం వారిని మళ్లీ ఇక్కడికి తీసుకువస్తుందేమో చూడాలి.

# హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్..!

మొదటిపేజీ తరువాయి – సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

# ఉక్రెయిన్, ఒడెశా పోర్టులో వాణిజ్య నౌకపై దాడి ఇద్దరు భారతీయులు గల్లంతు.. ఇద్దరు సురక్షితం



నలుగురు భారతీయులతో వెళ్తున్న వాణిజ్య నౌకపై ఉక్రెయిన్‌లోని ఒడెశా పోర్టు వద్ద దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు సిబ్బంది సురక్షితంగా ఉండగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు కీవ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. శనివారం ఈ దాడి జరిగినట్లు వెల్లడించింది. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని రాయబార కార్యాలయం ఆదివారం వివరించింది. ఎంవీ ఏజీఎన్ రంగార్ అనే వాణిజ్య నౌక నల్లసముద్రంలోని ఒడెశా పోర్టులో నిలిచి ఉంచిన సమయంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. ఈ పోర్టు వాణిజ్య రవాణాకు చాలా కీలకం. రష్యా-ఉక్రెయిన్ వార్ సందర్భంగా ఈ నౌకపై, ఈ పోర్టుపై గతంలో కూడా దాడి యత్నం జరిగినట్లు తెలుస్తోంది. దాడి నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని రాయబార కార్యాలయం తెలిపింది. దాడి సమయంలో ఇద్దరు భారతీయులు నౌకలో ఉండగా, ఇద్దరు సురక్షితంగా ఉన్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ దాడి ఎవరు చేశారు.. ఎందుకు చేశారు అనే వివరాల్ని మాత్రం భారత అధికారులు వెల్లడించలేదు. ఉక్రెయిన్ వాణిజ్యానికి నల్ల సముద్రంలోని ఒడెశా పోర్టు చాలా కీలకం.శ్రీవం ఉ మీఖీతీఎఖీఅఅస్త్ర జీశీఎం ఈ దేశానికి అత్యంత కీలకం కాబట్టి, 2022 ఫిబ్రవరిలో రష్యా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు అనేకసార్లు ఈ పోర్టుపై దాడి జరిగింది. మరోవైపు నల్ల సముద్రంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ కీలక ప్రకటన చేశారు. నల్ల సముద్రంలో ప్రయాణించే నౌకలపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో పని చేసే భారతీయ నౌకాయాన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను అంచనా వేసుకోవాలని కేంద్రం సూచించింది.

# గంగమ్మ ఒడిలోకి బాచుపల్లి బడా గణేశుడు

## కన్నుల పండుగగా గణేశుని శోభాయాత్ర..

## కోలాహలంగా మారిన బాచుపల్లి.

## డప్పు సప్పుళ్లతో సందడిగా సాగిన ఊరేగింపు

## రూ.6.42 లక్షలకు లడ్డూ దక్కించుకున్న భక్తుడు





**బాచుపల్లి,సెప్టెంబర్25(విజన్ పక్షం:** బాచుపల్లిలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పదకొండు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేక పూజలు, నైవేద్యాలు,హారతులతో ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం విద్యుత్ కాంతులు, భక్తి గీతాలు, కళాకారుల ఆటపాటల నడుమ గణనాథుడి శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. బాచుపల్లి మాజీ సర్పంచ్, ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజు మరియు యూత్ కమిటీ సభ్యులు నిమజ్జన వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శోభాయాత్ర ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన ప్రక్రియలో అవసరమైన ఏర్పాట్లను సమన్వయం చేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల సమన్వయం, యువత సహకారంతో నిమజ్జన వేడుకలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. ఖైరతాబాద్ మహా గణపతి తీర్చిదిద్దిన శిల్పి రాజేందర్ చేతుల మీదుగా రూపొందిన భారీ గణపతి విగ్రహాన్ని దర్శించుకునేందుకు పదకొండు రోజులుగా బాచుపల్లి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో ఉత్సవ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. నిమజ్జన శోభాయాత్రలో వందలాది మంది కళాకారులు పాల్గొని వివిధ కళారూపాలు, నృత్యాలు, ఆటపాటలతో భక్తులను అలరించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో బాచుపల్లి ప్రధాన రహదారులు పండుగ వాతావరణాన్ని తలపించాయి.లడ్డూ వేలం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మహా లడ్డూ వేలం పాట ఉత్కంఠభరితంగా సాగింది. భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్న వేలం పాటలో లడ్డూ రూ.6.42 లక్షలకు పలికింది. వేలం సందర్భంగా ఉత్సవ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

### వినాయక చతుర్థి వేడుకలు

బాచుపల్లిలో సుమారు 45 సంవత్సరాలుగా వినాయక చతుర్థి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్న సంప్రదాయానికి ఈ ఏడాది అదే ఆనవాయితీ కొనసాగింది.భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ప్రతిఏటా ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీపీ, ఏసీపీ స్థాయి పోలీసు అధికారులు పరిస్థితిని పర్యవేక్షించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్/సీఎంసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.నిమజ్జన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, బొంగునూరి కిషోర్ రెడ్డితో పాటు పలువురు స్థానిక ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు. భక్తులతో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తుల గణపతి నామస్మరణలు, మంగళహారతులు, కళాకారుల ప్రదర్శనలు, యువత ఉత్సాహంతో బాచుపల్లి బడా గణేశుడి నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. అనంతరం గణనాథుడిని నిమజ్జనం చేసి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు..

# ఎంఎస్ఎంఈల అభివృద్ధికి బ్యాంకుల బాసట

- సులభతర రుణాలతో సమర్థవంతమైన చేయూత
- రుణ దరఖాస్తుల సత్వర పరిశీలన, పరిష్కారానికి బ్యాంకుల చర్యలు
- ప్రత్యేక సమన్వయ సమావేశంలో ఎస్ఎల్బీసీ కన్వీనర్ కె.శ్రీధర బాబు




**సెప్టెంబర్ 25 (విజన్ పక్షం):** ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రుణ సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, వారికి అవసరమైన మార్గదర్శకత్వం, చేయూత సేవలను సమర్థవంతంగా అందించేందుకు శుక్రవారం విజయవాడ వన్‌టౌన్‌లోని లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ చేయూత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) కన్వీనర్, యూబీఐ జనరల్ మేనేజర్ కె.శ్రీధర బాబు, కేవీఐసీ స్టేట్ హెడ్ గ్రీప్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.మధు, వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. సమావేశంలో ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాలు, ప్రభుత్వ ప్రోయోజిత పథకాలు, రుణ ప్రతిపాదనల సత్వర పరిశీలన, పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం అంశాలపై చర్చించారు. అర్హత కలిగి, ఆచరణ సాధ్యమైన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు నిబంధనలకు అనుగుణంగా, తగిన మూల్యాంకనం అనంతరం ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామికవేత్తలు తాము ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాజెక్టు వ్యయం, మార్కెట్ అవకాశాలు, నిర్వహణ అవసరాలు, అంచనా ఆదాయం, వ్యయాలు, రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహనతో ప్రతిపాదనలు సమర్పిస్తే రుణాల పరిశీలన, మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. వ్యాపారం కోసం పొందిన రుణ మొత్తాన్ని, వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్దేశిత వ్యాపార అవసరాలకే వినియోగిస్తూ, సంస్థ కార్యకలాపాలను సజావుగా నిర్వహించి, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తి అర్హత కలిగిన రుణ దరఖాస్తులను బ్యాంకులు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డాక్యుమెంటేషన్, పథకాల అర్హత, ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు ప్రతిపాదనల రూపకల్పన తదితర అంశాల్లో పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ అధికారులు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని నిర్ణయించారు. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈ రుణ ప్రతిపాదనల పరిష్కారానికి బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ, ఇతర సంబంధిత శాఖల మధ్య నిరంతర సమన్వయం కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఏజీఎం (ఎంఎల్పీ) వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ హెడ్ రహీమ్, ఏజీఎం శ్యామ్, ఎన్‌టీఆర్ జిల్లా ఎల్‌డీఎం వెంకట సుబ్బయ్యతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు

# ఎంకేపల్లి మహా గణపతి లడ్డూ ప్రసాదం రూ.10.15 లక్షలకు వేలం




**ఎంకేపల్లి, సెప్టెంబర్ 25 (విజన్ పక్షం):** ఎంకేపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహా గణపతి ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదం వేలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహా గణపతి లడ్డూ ప్రసాదాన్ని శ్రీ సంఘం రమేష్ గారు రూ.10 లక్షల 15 వేలకు సొంతం చేసుకున్నారు. భక్తుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ లడ్డూ వేలానికి విశేష స్పందన లభించింది. గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకోవడం తమకు ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నట్లు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని వినాయక ఉత్సవాల నిర్వహణ, ఆలయ అభివృద్ధి మరియు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తి, ఐక్యత, సేవా స్ఫూర్తికి ప్రతీకగా ఎంకేపల్లి మహా గణపతి ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి.

# జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్గుల్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ హోమ్స్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు



ఘనంగా ముగిశాయి. గణేష్ నిమజ్జనం సందర్భంగా కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ, కలశం వేలం పాటలకు కాలనీవాసుల నుంచి విశేష స్పందన లభించింది. పోటీపోటీగా సాగిన వేలం పాటలో గణేశుని ప్రసాదం లడ్డూను సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగిల్ల జంగిరెడ్డి రూ. 3,36,000 కు దక్కించుకున్నారు. అలాగే పవిత్రమైన కలశాన్ని ప్రైవేట్ ఉద్యోగి పగిడి వెంకటేశ్వర్ రెడ్డి రూ. 1,35,000 కు పాడి సొంతం చేసుకున్నారు. గణేశుని ఆశీస్సులు తమ కుటుంబాలపై సదా ఉండాలని కోరుకుంటూ వేలం పాటలో పాల్గొన్నట్లు విజేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పి. లక్ష్మీనరసింహా రెడ్డి, జనరల్ సెక్రటరీ పి.ఎల్.ఎన్. రెడ్డి, ట్రెజరర్ జి. సాయి ప్రసాద్, గౌరవ అధ్యక్షులు యతేంద్ర ప్రసాద్, రవీందర్ రెడ్డి, ఆనందం, హరి కృష్ణ పాల్గొని వేలం పాట విజేతలను అభినందించారు. అలాగే వైస్ ప్రెసిడెంట్లు పల్లపు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, కిషన్ ప్రసాద్, మోహన్; జాయింట్ సెక్రటరీలు యాదగిరి, నవీన్ రెడ్డి, అనిల్ గౌడ్, జంగయ్య గౌడ్; ఆర్గనైజింగ్ సెక్రటరీలు వెంకటయ్య, వెంకటేష్ గౌడ్, ద్వారక రెడ్డిలతో పాటు టెంపుల్ చైర్మన్ బి. సీనయ్య, ఈసీ మెంబర్లు సుఖేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డి, సురేష్, హరిప్రసాద్ రెడ్డి మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. అనంతరం స్వామివారిని కాలనీవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా సాగనంపారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేశ్ లడ్డూ ప్రసాదం



వేలంలో మరోసారి సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది గణపతి లడ్డూను రూ. 39 లక్షలకు వనస్థలిపురం సాహెబ్ నగర్‌కు చెందిన అర్బన్ గ్రూప్ అధినేత సామ ప్రణీత్ రెడ్డి కైవసం చేసుకున్నారు. గత ఏడాది రూ. 35 లక్షలు పలికిన ఈ లడ్డూ ధర, ఈసారి ఏకంగా రూ. 39 లక్షలకు చేరి సరికొత్త రికార్డును నెలకొల్పింది. గణనాథుని ఆశీస్సులు లభించడమే కాకుండా, గ్రామంతో పాటు సమాజానికి మంచి జరగాలనే ఉద్దేశంతో భక్తులు ఈ వేలంలో పోటాపోటీగా 8 మంది భక్తులు లడ్డూ ప్రసాదం కోసం ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. హోరాహోరీగా సాగిన ఈ వేలం పాటలో సామ ప్రణీత్ రెడ్డి అత్యధికంగా రూ. 39 లక్షలు పాడి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడంపై ప్రణీత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, స్వామివారి కృపతో తమ సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. లడ్డూ దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు ఘనంగా అభినందించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

- ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ ప్రక్రియ
- వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**సెప్టెంబర్ 25 (విజన్ పక్షం):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మాది సంపూర్ణ రైతు ప్రభుత్వమని, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ధాన్యం సేకరణ అంచనాలు పెంచుతామన్నారు. శుక్రవారం విజయవాడ అంత్రాలక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్ షాపులో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్‌నీనో ప్రభావం ఉంటుందని తొలుత అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా మూడు రోజులపాటు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఉత్పత్తి అంచనాలను మరోసారి సమీక్షించి, అవసరమైతే సవరించనున్నట్లు చెప్పారు.

### 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సేకరణ సొమ్ము

ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల ధాన్యం సేకరణ సొమ్మును రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని పేర్కొన్నారు. అదే విధంగా ఈసారి కూడా రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సేకరణ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సొంత వాహనాలతో ధాన్యం తరలించే రైతులకు వెంటనే రవాణా ఛార్జీలు

రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించినప్పుడు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం జరుగుతున్న సమస్యను ఈ ఖరీఫ్ నుంచి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలు సకాలంలో, వీలైనంత త్వరగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం దాదాపు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

6.10 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం

ధాన్యం సేకరణకు ఈ సీజన్‌లో 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన గన్నీ బ్యాగులు రైతులకు అందేలా చూస్తున్నామని చెప్పారు. ఒకవేళ ఎక్కడైనా గన్నీ బ్యాగుల కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ బ్యాగులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

2,619 ధాన్యం సేకరణ కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 2,619 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అవసరమైన అన్ని సౌకర్యాలతో సేకరణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, సుమారు 24 వేల మంది సిబ్బంది రైతులకు సేవలు అందించనున్నారని తెలిపారు. సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించినట్లు చెప్పారు. ముందస్తుగానే సిబ్బందికి ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు.

### రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. వారికి కేటాయించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.

రైతుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు

ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు




ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కష్టం రాకుండా చూడటమే ప్రభుత్వ ఆశయమన్నారు. ధాన్యం సేకరణలో ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తూ, రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ఖరీఫ్‌లో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఖరీఫ్ ధాన్యం సేకరణను కూడా విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. వర్క్ షాపులో జిల్లాల జాయింట్ కలెక్టర్లు, రైతులు, రైస్ మిల్లర్లతో రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు.

### 2,619 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతులకు అందుబాటులో ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం దాదాపు 24 వేల మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం సేకరణకు అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేస్తున్నామని, ఇందులో భాగంగా 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

### జీపీఎస్ వాహనాలతో ధాన్యం రవాణా

ధాన్యం రవాణాలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం జీపీఎస్ అమర్చిన సుమారు 31 వేల వాహనాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ధాన్యం కొనుగోలుతో పాటే రైతులు తమ సొంత వాహనాల్లో ధాన్యం తరలిస్తే రవాణా ఛార్జీలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సాంకేతికతను వినియోగిస్తూ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

### గత ఖరీఫ్‌లో రూ.12 వేల కోట్ల విలువైన ధాన్యం సేకరణ

గత ఖరీఫ్ సీజన్‌లో సుమారు రూ.12 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని మంత్రి తెలిపారు. ఇందులో 92 శాతానికి పైగా మొత్తాన్ని 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా ఈసారి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వర్షాల పరిస్థితులకు అనుగుణంగా సేకరణ లక్ష్యాల్లో మార్పులు

ఎల్-నినో ప్రభావం కారణంగా గతంలో 1.60 కోట్ల టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి అంచనా సుమారు 1.10 కోట్ల టన్నులకు తగ్గిందని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, పంట పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ధాన్యం సేకరణకు సంబంధించిన అంచనాల్లో మార్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని వెల్లడించారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలి

క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, ప్రతి దశలో జవాబుదారీతనం, పారదర్శకత, సమన్వయం పాటించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. తొలుత మంత్రి నాదెండ్ల మనహర్ వర్క్ షాపును ప్రారంభించి మాట్లాడిన అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఖరీఫ్ పంట వివరాలు, తదితర విషయాలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ వివరించారు. కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (ూూూజూజు ్స) చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్ (తోట సుధీర్), ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ూచీ+ూఖ) వైస్ ఛాన్సలర్ డా. పి.వి. సత్యనారాయణ, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్, శ్రీమతి నుపూర్ అజయ్ కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. వెంకటేశ్వర రావు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా సివిల్ సప్లై అధికారులు, రైతులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హీరోలే డూప్‌లు వాడేస్తుంటే ఇంత సాహసం ఎందుకు?



ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గత కొంత కాలంగా స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలకు హై రిస్క్ ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం బాడీ డబుల్‌ని వాడేస్తున్నారని, సాహసాలు చేయడానికి ఇష్టపడటం లేదని, అయితే ఈ విషయాన్ని హీరోలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని నటుడు, డైరెక్టర్ రవిబాబు ఇటీవల ఓ బాంబ్ పేల్చిన విషయం తెలిసిందే. హీరోలు ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది పలు క్రేజీ సినిమాల్లో నటించి టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలిచిన రష్మిక ప్రస్తుతం భర్త విజయ్ దేవరకొండతో కలిసి -రణబాలి-లో నటిస్తూనే ఓ పవర్ ఫుల్ స్టోరీతో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా -మైసా-లో నటిస్తోంది. దీనికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక ఈ సినిమా కోసం ఎంత రిస్క్ చేయడానికైనా వెనుకాడటం లేదు. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేని విధంగా రష్మిక మందన్న ఓ సాహసం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం గోండు తెగకు చెందిన మువతిగా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ సినిమా కోసం రష్మిక తాజాగా పెద్ద రిస్కే చేసిందని తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా డైరెక్టర్ రవీంద్ర పుల్లె వెల్లడించడంతో అంతా షాక్ అవుతున్నారు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక పాత్ర చాలా ప్రభావ వంతంగా ఉంటుందని, ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయన్నారు. ఇటీవల కేరళలోని అతిర జలపాతం వద్ద అత్యంత క్లిష్టమైన ఓ యాక్షన్ సీన్‌ని షూట్ చేశాం. అయితే ఈ సన్నివేశం కోసం రష్మిక 80 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి డూప్ లేకుండా దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా పట్ల, నటన పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి టీమ్ అంతా ఆశ్చర్యపోయాం- అన్నారు. అయితే ఈ విషయం తెలిసిన నెటిజన్‌లు, అభిమానులు మాత్రం స్టార్ హీరోలే రిస్కీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడానికి భయపడుతున్నారు. ఇందు కోసం బాడీ డబుల్‌లని వాడేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి డూప్ లేకుండా ఇలా రిస్క్‌లు చేయడం అవసరమా? అని వాపోతున్నారు. 80 అడుగుల ఎత్తులో నుంచి దూకడం అనేది కరెక్ట్ కాదని, ఇకపై అలాంటి రిస్క్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# జపాన్‌లో ప్రభాస్ ఎన్టీఆర్ రేంజు చూపిస్తాడా?

**10 జూలై 2026న విడుదల కాబోతున్న ఈ చిత్రం.. మన టాలీవుడ్ హీరోల స్థాయిలో అక్కడ పట్టు సాధిస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.**



జపాన్ బాక్సాఫీస్ వద్ద భారతీయ సినిమాలకు ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఒకప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ వేసిన బాటలో ఇటీవల కాలంలో -బాహుబలి-తో ప్రభాస్, -ఆర్ఆర్ఆర్-తో ఎన్టీఆర్ -రామ్ చరణ్ అక్కడ అనూహ్యమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. అదే బాటలో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ నటించిన -ధురంధర్ 2- జపాన్ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. 10 జూలై 2026న విడుదల కాబోతున్న ఈ చిత్రం.. మన టాలీవుడ్ హీరోల స్థాయిలో అక్కడ పట్టు సాధిస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జపాన్ ప్రేక్షకుల అభిరుచి చాలా భిన్నంగా ఉంటుంది. కేవలం భారీ బడ్జెట్ లేదా యాక్షన్ ఉంటే వారు సినిమాలను ఆదరించరు. -బాహుబలి-లోని పురాతన గాథలు, జపాన్ సంస్కృతికి దగ్గరగా ఉండటం వల్ల ప్రభాస్‌ను వారు ఓన్ చేసుకున్నారు. అలాగే ఎన్టీఆర్, చరణ్‌ల ప్రతిభకు -ఆర్ఆర్ఆర్- సమయంలో వారు ఫిదా అయ్యారు. అయితే ఇటీవల మన దేశంలో సంచలనం సృష్టించిన దేవర, కల్కి 2898-ాూణ, పుష్ప 2 వంటి చిత్రాలు జపాన్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయాయి. ఈ నేపథ్యంలో రణవీర్ సింగ్ నటించిన ఈ -స్పై యూనివర్స్- కాన్సెప్ట్ వారికి ఎంతవరకు కనెక్ట్ అవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన -ధురంధర్ 2- కేవలం కమర్షియల్ హంగులతోనే కాకుండా.. ఒక సరికొత్త జోనర్‌తో ప్రేక్షకులను పలకరించబోతోంది. జపాన్ మార్కెట్‌లో సక్సెస్ కావాలంటే కేవలం స్కేల్ మాత్రమే సరిపోదు.. భావోద్వేగపూరితమైన అనుబంధం .. విస్మృతమైన కథనం ఉండాలి. ఒకవేళ ఈ సినిమా అక్కడి నేటివిటీకి దగ్గరగా ఉండి... పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే రణవీర్ సింగ్ కూడా ప్రభాస్, ఎన్టీఆర్ తరహాలో గ్లోబల్ స్టార్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. ట్రేడ్ వర్గాల విశ్లేషణ ప్రకారం.. -ధురంధర్ 2-ఒక ఆసక్తికర పోటీదారుగా కనిపిస్తోంది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 3000 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ చిత్రం,.. జపాన్‌లో కూడా అదే మ్యాజిక్‌ను రిపీట్ చేస్తే బాలీవుడ్‌కు ఒక కొత్త మార్కెట్ తెరుచుకున్నట్లవుతుంది. అయితే గత కొన్ని చిత్రాల పరాజయాలను దృష్టిలో ఉంచుకుంటే... జపాన్ కోటను బద్దలు కొట్టడం అంత సులభం కాదని అర్థమవుతోంది. రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్ మాధవన్ వంటి భారీ తారాగణం ఉండటం సినిమాకు ప్లస్ పాయింట్. మొత్తానికి రణ్ వీర్ జపాన్ ప్రేక్షకుల మనసు గెలుచుకుని ప్రభాస్, ఎన్టీఆర్ సాధించిన ఘనతను అందుకుంటాడా? లేక ఇటీవల విఫలమైన భారీ చిత్రాల జాబితాలో దురంధర్ 2 చేరుతుందా? అన్నది చూడాలి. జూలై 10న విడుదల కానున్న ఈ సినిమా ఫలితంపైనే రణవీర్ సింగ్ అంతర్జాతీయ ఇమేజ్ ఆధారపడి ఉంది. ఈ స్పై యాక్షన్ డ్రామాను జపనీయులకు నచ్చుతుందా లేదా తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.



# 'వివాహ భోజనంబు' వెనుక అంతర్జాతీయ స్ఫూర్తి!

తెలుగు సినిమా చరిత్రలో 'మాయాబజార్' ఓ అద్భుతం. ఆరు దశాబ్దాలు దాటినా సినిమాలోని ప్రతి సన్నివేశం, ప్రతి పాట నేటికీ తెలుగు వారి ఇళ్లలో మార్మోగుతూనే ఉంటుంది. ముఖ్యంగా ఎస్.వీ. రంగారావు తన నటనతో, ఆహార్యంతో ఘటోత్కచుడిగా ప్రాణం పోసిన -వివాహ భోజనంబు- పాట ఒక ఐకానిక్ సాంగ్. అయితే ఈ పాట వెనుక ఓ ఆసక్తికర అంతర్జాతీయ స్ఫూర్తి ఉందనే విషయాన్ని దర్శకుడు, నటుడు రవిబాబు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించి ఆశ్చర్యపరిచారు. ఈ క్లాసిక్ సాంగ్ రూపకల్పనలో హాలీవుడ్ ప్రభావం ఉందనేది వినడానికి వింతగా అనిపించినా? అది నిజమని రవిబాబు అంటున్నారు. 1935లో అమెరికాలో విడుదలైన -ది లాఫింగ్ పోలీస్‌మ్యాన్- అనే పాట నుండి స్ఫూర్తి పొంది -వివాహ భోజనంబు- పాటను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఆంగ్ల పాటలోని ఆ హుషారు, నవ్వుల మేళవింపును మన నేటివిటీకి, ఘటోత్కచుడి పాత్ర స్వభావానికి తగ్గట్టుగా మార్చి అద్భుతమైన బాణీని కూర్చారన్నారు. సంగీత దర్శకుడు ఘంటసాల గారు ఈ పాటను కంపోజ్ చేసిన విధానం నిజంగా ప్రశంసనీయం. ఒక విదేశీ పాటలోని ఆత్మను గ్రహించి దానికి పింగళి నాగేంద్రరావు గారి అమరమైన సాహిత్యాన్ని జోడించి తెలుగు తనాన్ని అద్దారు. ముఖ్యంగా పాట మధ్యలో వచ్చే ఆ విలక్షణమైన నవ్వులు, లయబద్ధమైన శబ్దాలు -ది లాఫింగ్ పోలీస్‌మ్యాన్- పాటలోని శైలిని పోలి ఉంటాయి. స్ఫూర్తి ఏదైనా? దానిని మన సంస్కృతికి తగ్గట్టుగా మలచడంలో మన దిగ్గజాలు చూపిన ప్రతిభ అసాధారణమైనది. సాధారణంగా గొప్ప కళాఖండాలు సృష్టించబడే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ కళారూపాల నుండి స్ఫూర్తి పొందడం సహజమే. రవిబాబు వెల్లడించిన ఈ రహస్యం సినీ ప్రేమికుల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. అప్పట్లోనే మన దర్శకులు, సంగీత దర్శకులు ప్రపంచ స్థాయి సినిమాలను, సంగీతాన్ని ఎంతగా ఫాలో అయ్యేవారో? వాటిలోని మంచిని మన ప్రేక్షకులకు ఎలా అందించేవారో ? ఈ ఉదాహరణ తెలియజేస్తుంది. ఆ స్ఫూర్తిని మేళవించి -మాయాబజార్- వంటి ఒక మాస్టర్ పీస్‌ను మనకు అందించారు. -వివాహ భోజనంబు- పాట వెనుక ఈ హాలీవుడ్ లింక్ ఉన్నా? అది నేటికీ పక్కా తెలుగు పాటగానే మన గుండెల్లో నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. స్ఫూర్తి పొందిన పాటతో పోలిస్తే వారు చేసిన క్రియేటివ్ మార్పులు ఆ పాటను మరో స్థాయికి తీసుకెళ్లాయి. దీంతో పాత తరం టెక్నీషియన్ల విజన్ ఎంత గొప్పదో మరోసారి రుజువైంది. -మాయాబజార్- మ్యూజిక్ లో ఇదొక కొత్త కోణమని చెప్పొచ్చు.



# ఆదర్శ కుటుంబం : మార్పు కాదు, మొదటి ఎంపిక!

ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం'. ఈ మధ్య కాలంలో ఫ్యామిలీ ఆడియన్స్ దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తున్న సినిమాగా కూడా ఈ సినిమాను చెప్పుకోవచ్చు. గత దశాబ్ద కాలంగా వెంకటేష్, త్రివిక్రమ్ మూవీ వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు వీరి కాంబో మూవీ పట్టాలెక్కింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత వెంకటేష్ ఫుల్ జోష్ లో ఉన్నాడు. ఆ జోష్ కంటిన్యూ చేసే విధంగా ఆదర్శ కుటుంబం సినిమా ఉంటుందనే విశ్వాసంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. త్రివిక్రమ్ మ్యాజిక్ చేసి ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమాతో మెస్మరైజ్ చేస్తాడనే నమ్మకంను ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ఫ్యామిలీ సినిమాలకు త్రివిక్రమ్ రైటింగ్ చాలా బాగుంటుందని ఈ సినిమాతో మళ్లీ నిరూపితం కాబోతుంది. ఆదర్శ కుటుంబం సినిమా కోసం... ఇప్పటికే షూటింగ్ ప్రారంభం అయిన ఈ సినిమాను మొదట 2026 సమ్మర్‌లో అనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. ఇటీవల సినిమాకు సంగీత దర్శకుడు మారాడు అంటూ వార్తలు వచ్చాయి. మొదట హర్షవర్ధన్ రామేశ్వర్ అనే సంగీత దర్శకుడి పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ ఇప్పుడు ఆ ప్లేస్‌లో థమన్ వచ్చి చేరాడు అంటే స్వయంగా సినిమాకు పని చేస్తున్న వారు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నారు. ఇప్పటికే చాలా మార్పులు చేర్పులు చేస్తున్నారు. అందుకే ఆలస్యం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ఇలాంటి సమయంలో హీరోయిన్ పూజిత పొన్నాడను దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎంపిక చేశాడనే వార్తలు వచ్చిన నేపథ్యంలో, సినిమా నుంచి హీరోయిన్‌ను కూడా తప్పించి కొత్తగా మరో హీరోయిన్‌ను ఎంపిక చేశారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో... పుకార్లపై యూనిట్ సభ్యులు అధికారికంగా స్పందించలేదు. కానీ అనధికారికంగా చెబుతున్నదాని ప్రకారం ఆదర్శ కుటుంబం సినిమాలో వెంకటేష్‌కు జోడీగా ఇంతకు ముందు అనుకున్నట్లుగా శ్రీనిధి శెట్టి కనిపించబోతుంది. అయితే ఈ సినిమాలో మరో కీలక పాత్రలో నటిస్తున్న నారా రోహిత్ కి జోడీగా పూజిత పొన్నాడ కనిపించబోతుంది. ఆమె పాత్ర పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. అందుకే షూటింగ్ చివర్లో జాయిన్ అయ్యి ఉంటుందని తెలుస్తోంది. చిత్ర యూనిట్ సభ్యులు ఇప్పటి వరకు సినిమాకు సంబంధించిన సాలిడ్ అప్‌డేట్ ఇవ్వడం లేదు. కనీసం లీక్ కూడా ఇవ్వడం లేదు. దాంతో సినిమాపై రోజు రోజుకు ఆసక్తి కొండలా పెరుగుతుంది. అందుకు తగ్గట్లుగా దర్శకుడు త్రివిక్రమ్ సినిమాను ప్లాన్ చేస్తాడా అనేది చూడాలి. శ్రీనిధి శెట్టి, పూజిత పొన్నాడ... ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు ఈ మధ్య భారీ వసూళ్లు నమోదు అవుతున్నాయి. అనీల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు సినిమాలు ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. కనుక త్రివిక్రమ్ సైతం కాస్త ఆ స్టైల్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఈ సినిమాను రూపొందిస్తే కచ్చితంగా తెలుగు బాక్సాఫీస్ వద్ద సరికొత్త నెంబర్స్ నమోదు కావడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వెంకటేష్ కి జోడీగా శ్రీనిధి శెట్టి నటిస్తూ ఉంది, ఆమెను తప్పించారనే వార్తలు పూర్తిగా అవాస్తవం. ఆమెను తప్పించకుండానే రోహిత్‌కు జోడీగా నటించడం కోసం పూజిత పొన్నాడను ఎంపిక చేశారని సమాచారం అందుతోంది. అధికారికంగా ఈ విషయమై ప్రకటన రావాల్సి ఉంది.



# భయపడుతున్న సమంత?

ఐతే చాలా గ్యాప్ తర్వాత ఇప్పుడు ఆమె మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది.

ఒకప్పుడు టాలీవుడ్ అనే కాక సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోనే టాప్ హీరోయిన్లలో ఒకరిగా ఒక వెలుగు వెలిగిన సమంత.. కొన్నేళ్ల నుంచి కథానాయికగా సినిమాలు చేయట్లేదు. 2023లో వచ్చిన శాకుంతలం తర్వాత ఆమె వెండితెరపై కనిపించింది తాను ప్రొడ్యూస్ చేసిన శుభమ్ అనే చిన్న సినిమాలో ఒక క్యామియో పాత్రతోనే. ఐతే చాలా గ్యాప్ తర్వాత ఇప్పుడు ఆమె మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. తన భర్త రాజ్ నిడిమోరు రచనా సహకారం అందించిన ఈ చిత్రానికి సమంత క్లోజ్ ఫ్రెండ్ అయిన నందిని రెడ్డి దర్శకురాలు. ఈ చిత్రాన్ని మే 14న రిలీజ్ చేయబోతున్నట్లు కొన్ని నెలల ముందే ప్రకటించారు. ఈ దిశగా ఇటీవల ప్రమోషన్లు కూడా మొదలుపెట్టారు. ఒక పాట లాంచ్ చేశారు. వెన్నెల కిషోర్‌తో కలిసి ఒక ఫన్నీ ఇంటర్వ్యూ కూడా చేసింది సామ్. ఇదంతా చూస్తే మే 14న మా ఇంటి బంగారం పక్కాగా రిలీజవుతుందనే అనిపించింది. కానీ ఇప్పుడు ఉన్నట్లుండి టీం ఆలోచన మారినట్లు తెలుస్తోంది. వేసవిలో ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రభావం సినిమాలపై గట్టిగానే పడుతోంది. పెద్ద సినిమాలు ఇంతకుముందులా వేసవిలో విడుదల కాకపోవడానికి.. రిలీజవుతున్న చిత్రాలకు ఆశించిన వసూళ్లు రాకపోవడానికి ఐపీఎల్ ఓ ముఖ్య కారణంగా భావిస్తున్నారు. మే 14 అంటే ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌లు చివరి దశలో ఉంటాయి. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా నడుస్తుంటుంది. తర్వాత ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఉంటాయి. కాబట్టి అప్పుడు యూత్ అంతా క్రికెట్‌కే అంకితమై ఉంటారనే ఆలోచనతో 14న రిలీజ్ చేయడానికి టీం తటపటాయిస్తోందట. టాక్సిక్ మూవీని జూన్ 4 నుంచి వాయిదా వేసిన నేపథ్యంలో ఆ డేట్‌ను తీసుకోవాలని సమంత అండ్ కో చూస్తోందట. డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇది మంచి ఆలోచన అని చెప్పడంతో మా ఇంటి బంగారం చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు సమాచారం. త్వరలో ఈ మేరకు ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రమోషన్లను కూడా టీం హోల్డ్ చేసినట్లు సమాచారం.

# రాముడికి ఇచ్చిన మాట కోసం!



పానిండియా బ్లాక్‌బస్టర్ 'హను-మాన్'కి సీక్వెల్‌గా వస్తున్న మైథలాజికల్ అడ్వెంచర్ 'జై హనుమాన్'. సప్త చిరంజీవుల మేళవింపుతో కూడిన కథాంశంతో హాలీవుడ్ 'అవెంజర్స్'ని తలపించేలా దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్న ఈ వెండితెర అద్భుతానికి కథానాయకుడు 'కాంతార'ఫేం రిషబ్‌శెట్టి. ఇందులో ఆయన వీరాంజనేయుడిగా కనిపించబోతున్నారు. రానా దగ్గుబాటి కీలక పాత్ర పోషించనున్నారు. ఆ పాత్ర వివరాలను చిత్రబృందం గోప్యంగా ఉంచింది. ఇక శుక్రాచార్యుడిగా అక్షయ్‌ఖన్నా.. ఇలా వివిధ పాత్రల్లో దేశంలోని పేరెన్నికగన్న తారలంతా ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఒక షెడ్యూల్‌ని పూర్తిచేసుకున్నది. మలి షెడ్యూల్ బుధవారం నుంచి మొదలైంది. రిషబ్‌శెట్టి, రానా, అక్షయ్‌ఖన్నాలపై కీలక సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్నారు. రాముడికిచ్చిన మాట కోసం హనుమంతుడు చేసిన యుద్ధమే ఈ సినిమా అని ఇన్‌సైడ్ టాక్. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈచిత్రానికి సంగీతం: గౌర హరి.